## 4

# భార్యాభర్తలు

## జరిమానా

సంగం నర్సయ్య తన వూరు వదిలి ఆవూరికొచ్చి వారంగడిచిపోయింది. పోలీసు గాలింపు చర్యలు ఎక్కువవడంతో దూరపు బంధువుల యింటికి వచ్చి చేరుకున్నాడు.

నర్సయ్యది పెళ్ళి కావల్సిన వయస్సు. బతుకు నిలకడలేక పెళ్ళి వాయిదా పడుతున్నది. రాకపోకలు ఎక్కువ లేకపోయినా రాకరాక వచ్చినందుకు ఆప్యాయంగా ఆదరించింది రాజక్క. బావ రోజూ పొద్దున్నే పనికి వెళ్తుంటాడు. సాయంత్రం యింటికి చేరుతుంటాడు.

ఉదయం లేచి వెళ్ళి కాలకృత్యాలు తీర్చుకుని పొలాలగట్ల వెంట పోతూపోతూ వస్తూవస్తూ, ఆవూరివాళ్ళతో మాటకలిపి స్నేహంచేస్తూ స్నానంచేసి యింటికిచేరే సరికి తిండి వేళవుతుంది.

తిన్నాక ఓసారి బజారు కలియదిరిగి మాటల్లోపడి పగటి నిద్రకు యింటికి చేరుతాడు నర్సయ్య. సాయంత్రం బావొచ్చాక మళ్ళీ ఆ వాడలో ముచ్చట్లు నడుస్తాయి. మధ్య నెపుడోలేచి నిద్రొస్తుందని వెళ్ళిపోతాడు బావ. రాత్రి పొద్దుబోయేదాక ముచ్చట్లు బెట్టి నిద్రబోవడం నర్సయ్యకు ఈ వారం నించి దినచర్యగా మారింది. ఊరికే ఉండలేక ఈ వారంలో చెత్తాచెదారం పేరుకుపోయిన ఆ యింటి చుట్టు, వూడ్చి మొరంపోసి, కంపకొట్టి శుభ్రంచేశాడు నర్సయ్య.

నిన్నటిదాక తన విషయంలో మౌనంగా వున్న రాజక్క

“బావతోటి పనికిపోతేంది? ఉత్తగ యింట్లుంటె ఏమత్తదిర ? అంగిలాగు పూర్తిగ పాడయినయి. నీకే అక్కరకస్తయిగద” అని అన్నది.

రాజక్క మాటల్లో అబద్ధం ఏమీలేదు. వారంరోజుల్నుంచి కూర్చుండి తింటున్నాడన్న అక్కసుకూడా లేదు. ఎంతో ఆలోచించి ఆప్యాయంగానే చెప్పింది. ఆమాటలు నర్సయ్యను మరోలా బాధించాయి, నిజంచెప్పాలంటే తానుగత

ఆరునెలల్నుంచి ఒక డ్రెస్సు కుట్టించుకోవాలనుకుంటున్నాడు. ఆర్థికంగా వెసులుబాటు దొరకడంలేదు. తనమీద మోపబడ్డ కేసులకోసం కోర్టులచుట్టూ తిరగడంతోనే సరిపోయింది. అక్టోబరు నవంబరు నెలలో సారా పోరాటం వుధృతం చేయడంతో ఎంత తప్పుకు తిరిగినా పోలీసుల బారినుంచి తప్పించుకుపోలేక పోయాడు. పాత కేసులకు హాజరవ్వడానికి కోర్టుకు వెళ్ళినపుడు కోర్టుఆవరణలోనే అరెస్టుచేసి వారంరోజులు తీవ్రంగా హింసించి కేసుపెట్టి జైలుకుతోలారు.

మళ్ళీ బెయిలు మంజూరయి జమానతుదార్లు దొరికి బయటికి వచ్చేసరికి అయిదువందల అప్పుపెరిగింది. కొట్టకుండా వుండేందుకని రెండువందలు అమీనుకిచ్చాడు తండ్రి. తాను అలాంటి పనులు చేయద్దని ఎంతమొత్తుకున్నా "యివ్వ' అంటూనే యిచ్చాడు తండ్రి.

డ్రెస్సు కుట్టించుకుంటే అప్పుపెరగడమేనని వూర్కొన్నాడు. అలా వెళ్ళ దీస్తున్నాడు. మళ్ళీ యింతలో కోర్టు కేసు హాజరుకై వెళ్ళాల్సివుంది. ఈ డ్రెస్సు మరీపాడైపోయింది. పైంటు మోకాళ్ళమీద రంగు వెలిసి పోయింది. కుట్లు ఎక్కడికక్కడ ఊడిపోతున్నాయి.

రాజక్క అన్నది వాస్తవమే. కాని నర్సయ్య తెగ బాధపడిపోతున్నాడు. ఇంటి పట్టున వుండి కొద్దికాలమైనా బావలాగా పెళ్ళిచేసుకొని తృప్తిగా సంసారం చేసు కుంటూ బతకగలిగితే ఎంత బాగుండు? కాని పోరాటం చేయనిదే బ్రతక లేని స్థితి.

ఎందుకో గతమంతా కళ్ళముందు కదిలింది. ఓ పన్నెండు మంది యువకులు కలిసి ఆరేళ్ళక్రితం వూళ్ళో సంగం పెట్టి రైతుకూలీలను సమీకరించారు. అలా దూరంనించి ఆసక్తిగా చూసే నర్సయ్య కొన్నాళ్ళకు సంగానికే అంటుకుపోయాడు. నాడు రెండురూపాయలున్న స్త్రీలకూలి నేడు ఏడురూపాయలకు, మూడురూపా యలున్న మగకూలి పన్నెండురూపాయలకు పెరిగింది ఆరు వందలున్న పాలేరుజీతాలు నేడు యేడాదికి వయస్సుల వారీగా పద్దెనిమిదినించి ఇరవై ఎనిమిది వందలదాకా పెరిగింది.

పదిహేడేళ్ళ నర్సయ్య వయస్సు యిరవై మూడేళ్ళకు పెరిగింది. తొలుత మొదలు పెట్టిన వాళ్ళల్లో గంగయ్య సంగంలో చురుకుగా పనిచేయడం మానుకుని పోలీసుల నిర్బంధానికి భయపడి పారిపోయి వేరే తాలూకాలో ఏదోపని చేసుకుని బతుకుతున్నాడు.

శాలోల్ల వెంకటయ్య, మాదిగోల్ల రాజయ్య యూజీకి వెళ్ళిపోయి అనగా నక్సలైట్లుగా మారి రెండేళ్ళవుతోంది. సంగం నర్సయ్య కూడా ఎన్నోసార్లు యూజీకి వెళ్ళిపోవాలని అనుకున్నాడు. ఎందుకోగాని అలానే వుండిపోయాడు. నేడు అవూళ్ళో సంగం ప్రధాన బాధ్యులైన అయిదుగురిలో ఒకడు. వాస్తవం చెప్పాలంటే ఆ అయిదుగురిలో ఎన్నుకోబడిన కార్యదర్శి నర్సయ్య.

అందువల్ల పనివత్తిడి, పోలీసువత్తిడి పెరుగుతున్నది. ప్రస్తుతం అటోయిటో తేల్చుకోవలసిన పరిస్థితి. ఈస్థితిలో పూర్తిగా సంగం బాధ్యతలు తప్పుకుని అవూళ్ళో బతకగలగడం అసంభవం. యూజీకి వెళ్ళడానికి తయారవుతున్నా తండ్రి పెళ్ళిచేసుకొమ్మని పోరుపెడుతున్నాడు. నర్సయ్యని మనస్సు ఏమూల పీకుతుందో ఏమో సందిగ్ధంలోపడిపోయాడు.

ప్రస్తుత స్థితిలో జీవితంలో పెళ్ళిచేసుకొని బతకాలంటే అవూళ్ళో అన్నిటికి రాజీపడాల్సిందే. నిర్బంధం భరించలేక బతుకుతో రాజీపడి సంగంతో తెగ తెంపులుచేసికొన్నా మేకల బొందయ్యను వూరిదొరలు పోలీసులు ఏగతి పట్టించారో నర్సయ్య కళ్ళారాచూసి ఆబతుకు బతకద్దు అనుకొన్నాడు. సంగంతో తెగ తెంపులు చేసికొన్నా పోలీసులు దొరలు వూర్కోలేదు. సంగపోల్ల జాడలు చెప్పుమని, ఎవరెవరువచ్చి కల్సిపోయేటోల్లని నిర్బంధించారు.

ఏవోకొన్ని పేర్లు, సంగపోల్లు రెండుమూడుసార్లు హెచ్చరించినా పోలీసుల (బాధ)కు మళ్ళీ చెప్పడంతో సంగపోల్లు కూడా బొందయ్యకు దేహశుద్ధి చేయక తప్పిందికాదు. అందులో నర్సయ్య ప్రధాన పాత్రధారి. చూస్తూచూస్తూ ఆ బతుకు బతకాలంటే అసహ్యంగా వుంది.

హోల్‌టైమర్‌గా యూజీకి వెళ్ళాలనివున్నా ఎందుకో తండ్రిమాటలు నర్సయ్యను ఆకట్టుకున్నాయి. అందువల్ల ఆలోచనలు మరోవైపు తిరిగాయి. ప్రస్తుత స్థితిలో పెళ్ళిచేసుకొని బతకాలంటే ఆవూరు వదిలిపెడితేనే సాధ్యం. రెండుపంటలు పండే పదిహేనుగుంటలపొలం, అయిదుగజాల యిల్లువదలి ఎందుకు బికారిగా బతకాలి? పొలం యిల్లు అమ్ముకొని వూళ్ళు తిరగాల్సిన గతి ఏంపట్టింది ? పొలంయిళ్ళతో పాటు పెళ్ళిచేసుకొని సగౌరవంగా అవూళ్ళోనే ఎందుకు బతక కూడదు? ఎవడికేం అన్యాయం చేశాడని ?

ఎండకాలం ఎండిపోయేకుంటలో జగన్‌రావ్ శనగ వేసికొంటుంటే ప్రస్తుతం

పోరాడి ఆయిరవై ఎకరాలలో శనగను సంగపోల్లే వేసుకుంటున్నారు.

రంగారావు తనవని చెప్పుకొని ఎన్నేళ్ళనుంచో అనుభవిస్తున్న చింతలు సంగం పోరాటం చెయ్యడంతో, ల్యాండురికార్డు, సర్వేవాళ్ళ కొలతల్లో అవి ప్రభుత్వజాగలో ఉన్నాయని తేలడంతో అప్పటినుంచి సంగమే అనుభవిస్తున్నది. తమ వూరికి ఆర్టీసీబస్సు నడిపేందుకు ఉద్యమించి సాధించుకున్నారు.

శిథిలావస్థలో వున్న ఆవూరి మట్టిరోడ్డును కంకరరోడ్డుగా మార్చాలని రెండేళ్ళుగా పోరాడితే ఇటివల బడ్జట్ మంజూరయింది.

వెంకట్రావుకే ఆ కాంట్రాక్టు దొరికింది. వచ్చినలాభంలో నాల్గోవంతు సర్పంచుకు యిచ్చే పూచీమీద సర్పంచ్ వెంకట్రావుకు కాంట్రాక్టువచ్చేట్టు చేశాదని కొందరు చెవులు కొరుక్కున్నారు.

ఎవరైనా మాకొక్కటే అని బయటి వాళ్ళని రాకుండాచూసి తామనుకున్నంత కూలిని సాధించుకుని సంగపోల్లు ఆ రోడ్డుకోసం పనిచేశారు.

రోడ్డువెడల్పును రికార్డులోకన్నా ఒక అడుగు తగ్గించిపోయడం, కంకర మీద రోడ్డురోలరు తిప్పకుండానే మట్టిపోయడంతో గొడవమొదలైంది. నాలుగు రోజుల్లో గొడవ చల్లారింది. కాని మరోకేసు పెరిగింది.

సర్పంచు దొంగలెక్కల్ని నిలదీయడంతో గ్రామసభలో జరిగిన అల్లరికి తిరిగి పోలీసుక్యాంపు తెప్పించాడు సర్పంచు మల్రెడ్డి. పోలీసులకు దొరికితే పెట్టే చిత్ర హింసలబాధవల్ల సంగంబాధ్యతలదృష్ట్యా పారిపోయినవాళ్ళల్లో నర్సయ్య ఒకడు.

ఉద్యమంలో యింతదూరం సాగిన తాను వెనుకడుగు వేసినా, ఆగిపోయినా, ఎలా వుంటుంది ? నేడు గొప్పగా కీర్తిస్తున్న వాళ్ళే రేపు వెక్కిరించకమానరు.

ఒక్కక్షణం ఉద్యమంమీద కోపం వచ్చింది. "వానియవ్వ పోరాటం మొదలు పెట్టింది కష్టాలుపోవడానికా ? పెరుగుటానికా! తనకైతే కష్టాలు పెరుగుతనే వున్నయిగానీ తరుగుతలేవు" అన్పించిందాక్షణం.

మరోక్షణం అలాంటి ఆలోచన మనస్సులో ప్రవేశించినందుకు పశ్చాత్తాపం పొందాడు. పోరాటం చేయకపోతే జగన్‌రావ్ పొలంలో తమపొలం కలిసేది. వాడిచ్చిన పైసలు ఏదో కర్చుకు పుట్నాల్లా ఎగిరిపోయేవి. రెండేళ్ళనించి కుంటలో శనగవేస్తే యాభయికిలోలు తన తండ్రి వంతుకు వస్తున్నాయి. ఈ చిన్న చిన్న

లాభాలకన్నా పెద్దలాభం ఒకటి జరిగింది. తామంతా తలెత్తుకుని ఆత్మ విశావ్వసంతో ధైర్యంగా నిలబడగలుగుతున్నారు. తమ సంఘం పలుకుబడి హోదా పెరిగి దొరల పలుకుబడి తరిగింది. ప్రస్తుతం చిన్న చిన్నవి సమస్యలుగా రూపుదాల్చక ముందే పరిష్కరింపబడుతున్నాయి. అదంతా సంగంవల్ల ఒనగూడిన ఆత్మ స్థైర్యంయొక్క ప్రత్యక్ష ఫలితం కాదా ! సంగమే లేకపోతే ఈవూరు యిలా వుండేదా! అంతెందుకు నర్సిగాడు "సంగం నర్సయ్య" అని దొరలతో పిలువబడేవాడేనా!

ఉద్యమాన్ని కోపగించినందుకు మనసులోనే తప్పుయిందని చెంపలేసు కున్నాడు నర్సయ్య. త్యాగాలు లేకుండా కష్టాలులేకుండా పోరాటం విజయవంతం కావడానికి యిదేమైనా నల్లేరుమీది బండినడకనా ? తనకు ధైర్యంచచ్చిగాని, ఎంత పోరాడితే అంతేగదా సాధించేది! సంగం ప్రయోజనాలకోసం పనిచేయాలను కున్నపుడు వ్యక్తిగత స్వార్థం ఎవరైనా సాధ్యమైనంత వదులు కోవల్సిందేకదా! కష్టాలు తప్పనిసరేకదా!

రాజక్క చెప్పినట్టు పనిలోకి పోతే మంచిదేమో, కాని బావతో బావుల్లో పూడిక తీయడానికి పౌరుషానికి వెళ్ళినా పోలీసు చిత్రహింసలు తిన్న శరీరం సహకరించకపోవచ్చు.

అసలు వూళ్ళోంచి పారిపోకుండా వుద్యమాన్ని నిర్మించనేరాదా! పోలీసులు రావడం, పారిపోవడం ఈ పాత పద్ధతిని అధిగమించే మార్గమే లేదా! లేనపుడు ఉన్న నలుగురు దొరల్ని నరికి పారిపోతే ఊరిపీడానైనా వదులుతుంది గదా!

అన్నలు అనుమతిస్తే ఎన్నడో రాలిపోదురు ఈనలుగురు. అసలు అన్నలుయిలా ఎందుకు తయారైనారు ? పూర్వం ఎక్కడపడితే అక్కడ ఖతం ఖతం చేసేవాళ్ళు! యిపుడేమొ మనలను ఎంతతన్నినా ఎన్ని పుల్లెందులపాలుజేసినా ఓపిక! ఓపిక పట్టండి అని అంటున్న రెందుకు? అన్నల్లోకూడా ధైర్యం సన్న గిల్లిందా ఏంది! ఎక్కన్నో ఎవలనో ఖతంచేసినట్టూ, కాలుసెయితీసేసినట్టు వార్తలస్తున్నయిగని యిక్కడెందుకు చేయద్దు?

వాడుచస్తే అట్లాంటోడు మళ్ళీ ఒకడు తేలుతాడు అనిచెప్తాడు దేవన్న. గట్లంటె గక్కడెందుకు ఖతంచేసిన్రు అంటె వర్గశతృవు ప్రవర్తననుబట్టి అక్కడ తప్పలేదు కాబట్టి చేసిన్రు అంటడు.

మల్ల కొత్తోడు తేలెదాక వాళ్ళకు ఎంతనయం. మేం మాత్రం ఎప్పటికి పాతవాళ్ళతోనే గిట్లనే సచ్చెదాక కొట్లాడుడా ? అంటె దేవన్న నవ్వి వూకుంటడు.

దేవన్న మీదికి అలోచన బోవడంతో ఈవారంరోజుల్నుంచి అన్నను కలిసే ప్రయత్నం చేయనందుకు కించపడిపోయాడు. తన ఆలోచన తనదేకాని దేవన్న ఆలోచన విన్నవాడు కాదాయె. ఇప్పటికైనా అన్నను కలిస్తేబాగుండు.

తాను యిక్కడినుండి ఎక్కడికని వెళ్ళి కలుస్తాడు. దేవన్ననే యిక్కడికి రావడానికి అడ్రసు ఎలా తెలుస్తుంది? పగటి నిద్రపట్టక ఆలోచనతో అటూయిటూ పొర్లాడు.

"నర్సన్న ఉన్నడా"

ఎవరో అక్కను అడగటంతో లేచికూర్చున్నాడు సంగం నర్సయ్య. సమ్మయ్య కామ్రేడ్ దేవన్న వెంట వుంటాడు. తాను తన మనసులో అనుకున్నదేతడవుగా దేవన్న కబురు అందడంతో పొంగిపొరలిన సంతోషంతో సమ్మయ్యను కౌగలించుకున్నాడు నర్సయ్య. తనని కలవడానికి దేవన్న మూడురోజుల్నుంచి గాలిస్తున్నాడని తెలిసాక అన్నపై అభిమానం మరింత పెరిగింది.

అలా మాట్లాడుతుంటే రాజక్క సమ్మయ్యని అన్నం తినమంది. తిన్నానని అన్నా వదల్లేదు రాజక్క. "నావంతుది సద్దిగట్టియ్యి తొవ్వల దింట' అని నవ్వుతూ సమ్మయ్య అంటే ఆమాటమీదే విస్తట్లో సద్దిగట్టింది.

సద్దితీసుకుని సమ్మయ్య, నర్సయ్య బయటికినడిచారు. ఓచోట కరెంటు పంపుపక్కనున్న చెట్టునీడన దేవన్న- అన్నవెంట వుండే మరోఅతను లచ్చయ్య నవ్వుతూ పలకరించారు. ఆ అన్నం దేవన్న, లచ్చయ్యా చెరి కొంచెం తిన్నారు. మొత్తం విషయం తెలిసినా మళ్ళీ నర్సయ్య నోటినుంచి విన్నాడు దేవన్న. ఏంచేస్తే బాగుంటదో తన అభిప్రాయం తెలిపాడు నర్సయ్య. అన్నీ విన్నాడు దేవన్న.

"అయితే ఒకల్లదో, యిద్దరియో కాల్లుసేతులన్న తీసేస్తెనే తిక్కకుదురు తుందంటవు' అడిగాడు దేవన్న.

అవునన్నాడు నర్సయ్య.

"పిడుక్కి బియ్యానికి ఒకటె మంత్రం అంటె ఎట్ల? శత్రువు మనఎడల ప్రవర్తించే తీరునుబట్టి మన ఎత్తుగడలు నిర్ణయించుకొంటాము. శత్రువు ప్రవర్తన మనని ఆ

పరిస్థితులలోకి నెట్టితే అట్లనే చెయ్యాలె. మనవూరి విషయానికస్తే ఇదితప్ప వేరే మార్గం లేదంటవా ? మునుపటికి యిప్పటికి మనవూరు దొరలు ఎంత మారిన్రు. అట్లని మంచోల్లని అంటలేను. శత్రువు పిరికితనంతో ఒకోసారి మరీ పిచ్చిగా నిర్బంధం తీవ్రతరం చేస్తాడు. అట్లా పెరుగుతున్న నిర్బంధాన్ని వారిచేతే తగ్గించే వుపాయాలు ఎత్తుగడలు పద్ధతులు అనుసరించాలె మనం." అన్నాడు దేవన్న.

"ఇప్పటికే మన వూరివాళ్ళు కోర్టులచుట్టూ తిరిగి తిరిగి, విసిగిపోయిన్రు. అప్పులపాలయిన్రు. వ్యవసాయం కుంటుపడుతున్నది. ఈస్థితిలో ప్రస్తుతం ప్రతీకారం తీర్చుకొనుడు కూడా ముఖ్యమే." అంటూ సముదాయించాడు దేవన్న.

"సాంఘికంగానేగాక ఆర్థికంగా కూడా దిగజారిపోతున్న స్థితిలో వర్గశత్రువు తనను తానుగా (వర్గశత్రువుగా) యధాస్థితిలో వుండిపోవాలని నిర్బంధాన్ని ఆశ్రయించాడు. మనం వాన్ని మరింత పిరికివాన్ని చేయాలి. వారిని ఆర్థికంగా మరింత దిగజార్చాలె. అదే సమయంలో మనవాల్ల ఆర్థికపరిస్థితి మెరుగు పడగలగాలి. ప్రస్తుతం మన ఎత్తుగడలు ఈలక్ష్యాన్ని సాధించేవిగా వుండాలె. మన పోరాటాలు మలుపు తిరుగుతున్నాయి. మన ఎత్తుగడలుకూడా ఆ క్రమంలోనే వుండాలె!" అంటూ దేవన్న సంఘం చేయాల్సిన కొత్త కార్యక్రమాలు వివరించాడు.

ఆసక్తిగా వింటున్న నర్సయ్య "అబ్బో! గంతమంచి ఉపాయాలుకూడ ఉన్నయా అన్నా!" అని సంతోష పడిపోయాడు. చిరునవ్వుతో మళ్ళీ కొనసాగించాడు దేవన్న.

"మనపోరాటం ఎదుగుతున్నది. పోరాట ప్రాంతాలు పెరుగుతున్నాయి. మనమిపుడొక బలమైనశక్తిగా రూపుదిద్దుకొన్నాం. ప్రస్తుతం మనకు వ్యతిరేకంగా పనిచేస్తున్న వాళ్ళని మనమే అదుపుచేయగల స్థితిలో వున్నాం."

"మనవాళ్ళు ఈ దొంగకేసులతో కోర్టులచుట్టూ తిరగడంవల్ల ఎంతో నష్టపోయారు. ఈనష్టానికి దొరలే కదా బాధ్యులు! అందువల్ల ఈ వకీలు ఫీజులు, బస్సు కిరాయిలు, పోలీసులు వసూలుచేసుకొని పోయిన మామూళ్ళు, ఎత్తుక పోయిన సామానులు, నిరుడు పంట కోయనీయకపోతే జరిగిన నష్టం ఇవన్నీ లెక్కదీసి ఎవరివల్ల ఎంతనష్టం జరిగిందో అంత మొత్తాన్ని నష్టపరిహారంగా వారినుండి వసూలుచేయాలె. ఇది వాళ్ళమీద మనం వేసే పన్ను! దీంతో వాళ్ళని వంగదీసినట్టు అవుతుంది. మనవారికి ఆర్థికంగా ఎంతోకొంత ఊరట దొరకడమేగాక ప్రతిసారి పారిపోయే స్థితినుండి వూళ్ళో నిలబడగలిగేస్థితి వస్తుంది.

అందుకు ప్రజాపంచాయతీ నిర్వహించండి. ఈవిషయాన్ని మనవూళ్ళో అందరితో ఈవరకే మాట్లాడిన.”

నర్సయ్యకు ఈ ఎత్తుగడ ఎంతోనచ్చింది. మనసులోనే లెక్కలువెయ్య సాగాడు. కనీసం యాభై వేలయినా ఆ నల్గురినుండి వసూలుకావలసి వుంటాయి. కేవలం తనకొక్కడికే మూడువేలు వాపసు వస్తాయి. తమకున్న అప్పుభారం మంచులా కరిగి నీరైనట్లుగా స్వేచ్ఛగా వూపిరిపీల్చాడు. సంగం ఇది సాధిస్తే కొన్నాళ్ళ దాకా వూరువిడిచిపెట్టిపోయే పనిలేదు. అప్పటికి అప్పులేమీ వుండవు. ఇంటిని తమ్ముడు నెట్టుకురాగలడు. తాను సంగంపని చేస్తూనే లక్ష్మిని పెళ్ళిచేసుకొని కొంత కాలమైనా తృప్తిగా వూళ్ళో వుండగలగడానికీ ఈపద్ధతి ఎంతో బాగుంది. ముఖ్యంగా తాను లక్ష్మిని పెళ్ళి చేసుకోవడానికి వున్న అడ్డంకులన్నీ తొలగిపోయి నట్టయి గుండె బరువుదిగిపోయి వుల్లాసపడి పోయాడు. పెళ్ళి చేసికొన్నాక కూడా మరింత బాధ్యతగా ఎందుకు సంగం పనులు చేయకూడదు ? అలా ఆలోచిస్తు న్నంతలో మెల్లగా దేవన్న మరో విషయం కదిపాడు.

“నర్సన్నా! మీనాయిన ఒకటే పోరు. మొన్న కల్సిండు. నువ్వన్న జెప్పు. ఈనికి లగ్గం చెయ్యంది చిన్నోనికి చెయ్యరాదాయె అనవట్టె! మరి నీ వుద్దేశం ఎట్లున్నది? పెళ్ళి చేసికొంటవా ?.........గానడమ హోల్‌టైమర్ (పూర్తికాలపు కార్యకర్త) నయిత నంటివి . ఇట్లనే వుంటవా?! హోల్ టైమర్ వయితవా ? నీ యిష్టం. నీ నిర్ణయ మేంటిదో చెప్తే పార్టీ నీ గురించి ఆలోచిస్తది.” అంటూ దేవన్న నర్సన్నకేసి పరీక్షగా చూసాడు.

“నాకు హోల్‌టైమర్ కావాలనే వున్నది. కని మా నాయిన్నతోటే వచ్చిందిగోస” అన్నాడు నర్సయ్య. తన కోరికను తండ్రికి అంటగట్టడంగా భావించి చిన్నగా నవ్వాడు దేవన్న.

“మరి పిల్లను గిట్ల జాడదీసుకున్నవా? మమ్ముల జాడదియ్య మంటవా?” అని అడిగాడు.

ఆ నవ్వు ఎందుకో తనని కత్తిలా కోసినట్టు విలవిలలాడాడు సంగం నర్సయ్య.

“నేను సంగానికి, విప్లవానికి దూరంబోవాలని చూస్తలేను. నా మనస్సునిండా పోరాటమే ఉన్నది. ఈ వారంరోజులల్ల ఈ వూరు ఎట్ల మారిందో సూడు.

ఇంకొద్ది రోజులల్లో సంగం బెట్టుకుంటరు సూడు. ఇపుడు నువ్వువోయి ఒక్కసారి కలువు వాల్లు ఎట్ల అగ్గయి మండుతరో తెలుస్తది."

తను ఈ వారం రోజులు వ్యర్థంగా గడపలేదనీ వాళ్ళని చైతన్యపరచడానికే ఈ సమయాన్ని వెచ్చించాననీ ముందుముందు కూడా యిలాగే పనిచేస్తానని చెప్పాలని ఆరాటపడి పోయాడు. కాని చెప్పలేకపోయాడు. అయినా దేవన్న విషయం గ్రహించాడు.

"నిన్ను తక్కువ అంచనా వేస్తున్నని ఎందుకనుకుంటన్నవు. నిత్యం శత్రువు కళ్ళెదుట కదులుతూ నిత్యం నిర్బంధాన్ని తట్టుకుంటూ నీవు చేస్తున్న పని తక్కువ పనేమీకాదు. చేయదల్చుకున్నవారు, ఏరంగంలోనైనా ఏవిధంగానైనా పని చేయగలుగుతరు. నువ్వు గట్లెందుకు బాధపడుతవు. పెళ్ళిచేసుకోవాలనివుంటే చేసికో" సమాధానపరిచాడు అన్న.

"మీరెట్లంటె అట్ల" అని భారం దేవన్న మీదనే వేశాడు నర్సయ్య.

అతని అభిప్రాయం చూచాయగ చెప్పాక, యిక తనకు పెద్దరికమివ్వడం అనేది గౌరవసూచకంగా మాత్రమే. అందువల్ల నర్సయ్య అభిప్రాయాన్ని మన్నించడమే నరైంది అని నిశ్చయించుకున్నాడు దేవన్న.

"నేను నిజంగనే అడుగుతున్న. నీ మనసుల ఎవరన్న వున్నరా! లేక పోతే నేను నీకునచ్చే పిల్లను జాడదియ్యన్నా!" ప్రసన్నంగా అడిగాడు దేవన్న.

"నీకు బీరుపురం పోశన్న తెల్సుగద అన్నా!'

"కామ్రేడ్ పోశన్ననా? యిప్పుడు జేల్లనే వున్నడు, ఆ కేసుల మూడేండ్లు శిక్షపడ్డది. తండ్రి ఎన్నడోపాయె. తల్లి ఒకతే వున్నది."

"పోశన్న చెల్లె లక్ష్మి మంచిపిల్లనేగదా! అన్నా!"

"గట్లడుగవడ్తివేంది? మొన్నటిదాక ఎక్కడ సంగం మీటింగైనా ఎన్నిపాటలు పాడుతుండె. ఆ చెల్లెది ఎంత మంచి కంఠం! ఈనడమ ఇంట్ల ఎల్లతలేదని తల్లి ఎటు పోనిస్తలేదు. అయినా...!" అంటూ అర్ధోక్తిగా ఆగిపోయాడు అన్న.

ఆమాటతో నర్సయ్య ఆందోళనపడిపోయాడు. ఏంచెప్తాడోనని ఆసక్తిగా దేవన్న కళ్ళల్లోకి చూశాడు. ఉత్తరందిక్కున దూరంనుంచి పిల్ల బాట వెంట వెళ్తున్న వ్యక్తిని పరీక్షగా చూస్తున్నాడు నర్సయ్య.

కుడిపక్కన కొద్దిదూరంలో కూర్చున్న బుచ్చన్న బీడి ఆఖరిపీల్పు పీల్చి భూమికేసి రాసి ఆసక్తిగా వారిద్దరివేపు చూశాడు. దేవన్న అలా ఎందుకాగిపోయాడా అని అలోచనలోపడ్డాడు. వారిద్దరి కులాలువేరు. ఆ విషయమే అడ్డంకియా అని దేవన్నను అడిగాడు. దేవన్న అది కాదని తల అడ్డంగా వూపాడు.

"గది అడ్డంకి ఎట్లయితది? గని" అని నర్సయ్యవేపు తిరిగి "లక్ష్మి హోల్ టైమర్‌గా వస్తనని వుత్తరంరాసి పంపింది. మరినీకు తెలువదా?'" తన ఆశ్చర్యానికి అసలు కారణం చెప్పాడు దేవన్న.

"జా! నాతోగూడ గదేమాటన్నది......." సగర్వంగ చెప్పాలనుకుని బయ పడిపోయాడు నర్సయ్య.

"అంటే" ఈసారి ఆశ్చర్యపోవటం దేవన్నవంతైంది.

నేలకువాల్చిన తలఎత్తి దేవన్న కళ్ళల్లోకి చూస్తూ

"నేనుగుడ హోల్‌టైమర్‌గా......... కాని పోలీసోల్లు దొరలు గిట్ల వూర్లె వుండనిచ్చినన్నిరోజులు వూర్లెవుండుకుంటునే పని చేద్దామనుకుంటున్న. గిండ్ల ఏదన్న తప్పుంటె సెప్పు సరిదిద్దుకొంట."

నర్సయ్య మనస్సులోని దృఢదీక్షను సంపూర్ణంగా అర్ధంచేసుకోలేక పోయినందుకు కొంత కించపడ్డాడు దేవన్న. వెంటనే తేరుకొని ఆప్యాయంగా నర్సయ్యను కౌగలించుకున్నాడు.

"హోల్ టైమర్‌గ వస్తనన్న నీమనసులోని మాట నాకుజెప్తె లక్ష్మిని చేసికొంటె మంచిగుంటదని నేనే అనివుందును. అయినా నీకునీవే బాధ్యతగ అన్న ఆసర కోల్పోయిన చెల్లెను కట్నం, కులం ప్రసక్తి లేకుంట పెళ్ళిచేసుకుంటున్నవు. పోరాటక్రమంలో చితికిపోయిన కుటుంబాల్ని ఆదుకోవాల్సిన కర్తవ్యాన్ని స్వచ్ఛందంగా ఆదరించి నీ ఆచరణతో ఆదర్శంగా నిలుస్తున్నవు. నీకు..కాదు మీఇద్దరికి నా విప్లవాభినందనలు."

కామ్రేడ్ దేవన్న ఉద్వేగంగా మరోసారి కౌగలించుకున్నాడు.

"అయితే మీరిద్దరు ఇంతలోనే అదనపు భారం రాకుండ కొంతజాగ్రత్త తీసుకోవడం అవసరమేమో" తన సూచన వెల్లడించాడు దేవన్న.

నర్సయ్య వూర్లో ఉండుకుంటూ కూడ విప్లవంగూర్చి యింతగా ఆలోచించడం అదంతా వింటున్న బుచ్చన్నకు కలిగిన ఆనందోద్రేకంతో మాటపెగలలేదు.

చూపులతోనే అభినందనలు తెల్పుతూ చేతిలో చేయికలిపాడు.

ఇకనుండి చేయాల్సిన పోరాటం గూర్చి మెళకువలు మళ్ళీ మళ్ళీ చెప్పి సెలవుదీసుకున్నాడు దేవన్న.

ఆతర్వాత కొన్నిరోజులకే దొరలనుండి సంగం దండుగులు వసూలు చేసిందని, దొరలతో బలవంతంగా పోలీసుక్యాంపు ఎత్తివేయించిందని పత్రికల్లో ఓమూల వార్తపడింది.

ఆరునెల్లకు నర్సయ్య లక్ష్మిల పెండ్లి రాడికల్స్ ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిగింది. పదూర్ల నుండి ఆ మీటింగు పెండ్లికి వేల జనం తరలివచ్చారు. ఎన్నో పాటలు పాడారు. అలా వాళ్ళిద్దరు బార్యభర్తలు అయ్యారు. కొత్త కోడలితో ఆ వూరికి కొత్త కళ వచ్చింది.

**కథా కాలం 1981, రచనా కాలం 1983.**

**"జరిమానా" పేరుతో - 'సృజన' మాస పత్రిక - సెప్టెంబర్ 1984**

గ్రామంలో ప్రజాపోరాటాలు నిర్వహిస్తున్న ఒక పేదరైతు మనస్తత్వాన్ని తెలిపే కథ ఈ భార్యాభర్తలు కథ. ఉద్యమానికి నాయకత్వం వహిస్తూ, పోలీసుల నిర్బంధాన్ని భరిస్తూ ఉద్యమ కారుడు చివరిదాక నిలబడటమే ఈ కథ ఉద్దేశం.

ఎక్కడైనా ఉద్యమం మొదలుపెట్టినవాడు చివరిదాక వుండాలంటె ఎన్నో కష్టాలను అధిగమిస్తూ వుండాలి. పెండ్లి, తల్లిదండ్రులు, సుట్టు బంధువుల వత్తిడులు, దొరల భూస్వాముల నిర్బంధం, వీటన్నిటితోపాటు సంఘంలో అందరి ఆదరాభిమానాలను కూడా చూరగొనటం.

కొద్దోగొప్పో వ్యవసాయం ఉన్న ఉద్యమ కార్యకర్త ఆలోచన విధానమే భార్యాభర్తల కథ. పోరాటానికి అంకితం కావటమా! లేక పెండ్లి చేసుకుని ఊళ్ళో ఉంటూ సంఘాన్ని కాపాడుకోవటమా! అనేది ఎన్నోసార్లు ఇందులో కథానాయకుడు పరిపరి విధాలుగా ఆలోచిస్తాడు. ఈ కథలో పేదరైతు మనస్తత్వం రచయితగారు చాలా స్పష్టంగా తెలియజేశారు. కొద్దిగా పోరాటాలు, కొద్దిగా ఆదర్శాలు అవసరమైతే ఏ త్యాగానికైనా తాము సిద్ధమే అన్నట్లుగా ఈ భార్యాభర్తల కథ మనకు తెలుస్తుంది.

**- నందిగామ నిర్మలకుమారి**

(ఎం.ఫిల్ నుండి)